క్లుప్తంగా

ఆలమూరు చెరువుకు జలకళ



భారీగా చెరువుకు చేరిన నీరు

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు చెరువుకు భారీగా నీరు వచ్చి చేరింది. కొన్ని రోజులుగా చెరువుకు నీరు వచ్చి చేరుతున్నాయి. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు నీటిని అవుకు జలశయానికి తరలిస్తున్నారు. ఈ కాల్వ వెంట లికేజీ అయిన నీటితో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా నీరు చెరువుకు చేరాయి. దీంతో చెరువులో పూడిక తీద్దామనుకున్న రైతుల ఆశలు గల్లంతయ్యాయి. ఇంకా నీరు చెరువుకు వస్తునే ఉందని స్థానికులు తెలిపారు. చెరువు సగానికిపైగా నిండినట్లు చెప్పారు.

టీబీపై అవగాహన



మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు

కల్లూరు: టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం సచివాలయంలో డెమో శ్రీనివాసులు టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్లు పైబడిన వారు, పొగ తాగువారు, మద్యం సేవించు వారు గళ్ల పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందజేస్తాన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్త మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం



మూల పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ధర్మసాయి

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలకు చెందిన జి.ధర్మసాయి 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలలో 584 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపులపాయలో గల ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది.

26 నుంచి ఆషాఢమాస పూజలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని సూర్యానారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 26వ తేదీ నుంచి ఆషాఢ మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహాగౌరీ అమ్మవారికి వారాహీ నవరాత్రి (గుప్త నవరాత్రులు) పూజలు జరుగుతాయని వెల్లడించారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9.30 గంటలకు లలితా సహస్ర నామార్చన, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు వారాహీ సహస్ర నామార్చన, హోమాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. పూజల్లో భక్తులందరూ పాల్గొనవచ్చని తెలిపారు.

చిన్నారుల చదువులు చిన్నాభిన్నం!

- విద్యా వ్యవస్థలో అనూహ్య మార్పులు తెచ్చిన కూటమి ప్రభుత్వం
- ప్రాథమిక విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- 3,4,5 తరగతులు సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో విలీనం
- గ్రామీణ చిన్నారులు చదువుకు దూరమయ్యే ప్రమాదం



నన్నూరులోని హరిజనవాడ ప్రభుత్వ పాఠశాల

ఓర్వకల్లు : ఈ విద్యా సంవత్సరంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన అనూహ్య మార్పులు చిన్నారుల చదువులను చిన్నాభిన్నం చేసేలా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చి 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో వినీనం చేయడంతో గ్రామీణ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపితే చదువుకు దూరమవ్వడంతోపాటు భవిష్యత్తులో గ్రామంలోని పాఠశాల మూతపడే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

మండలంలోని పాఠశాలలు..

ప్రభుత్వం చేపట్టిన స్కూళ్ల మ్యాపింగ్ విధానంతో మండలంలో ప్రస్తుతం 16 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, 13 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 4 ఫౌండేషన్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 2,538 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 1,265 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,037 మంది, ఉన్నత పాఠశాలల్లో 4,375 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటితో పాటు లొద్దిపల్లె ప్రభుత్వ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో కలిపి 1,830 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 11,045 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిల్లో 175 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

4 ఫౌండేషన్ పాఠశాలలు

కొత్త నిబంధనల ప్రకారం మండలంలోని హెచ్ కొట్టాల, నన్నూరు హరిజనవాడ పాఠశాల, లొద్దిపల్లె హరిజన పాఠశాల, ఉయ్యాలవాడ హరిజనవాడ పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా స్థాయి తగ్గించారు. గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకొని, ఒక పంచాయతీ పరిధిలో విద్యార్థుల సంఖ్య 62 మంది కంటే తక్కువగా ఉన్నట్లయితే ఆ పాఠశాలను ఫౌండేషన్ పాఠశాలగా పరిగణిస్తారు. ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యుకేజీ, 1, 2 తరగతులను మాత్రమే నిర్వహించి, మిగతా 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని బేసిక్ ప్రాథమిక పాఠశాలలకు తరలిస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో సదరు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత తగ్గి చివరకు పాఠశాలలు మూతపడే అవకాశం వుందని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వ్యతిరేకిస్తున్న తల్లిదండ్రులు

నన్నూరులోని హరిజనవాడ పాఠశాలలో 55 మంది విద్యార్థులు వుండగా ఎల్‌కేజీ, యూకేజీ, 1, 2 తరగతులలో 35 మంది విద్యార్థులను వుంచుకొని, మిగతా 20 మందిని సమీపంలో మెయిన్ పాఠశాలకు పంపుకోవాలని అధికారులు ఆదేశాలివ్వడంతో తల్లితండ్రులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయాన్ని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువును చిన్నాభిన్నమయ్యే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను విరమించుకొని తమ పిల్లలను ఇదే పాఠశాలలో కొనసాగించాలి డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ఎంసీ సభ్యులకు చెప్పలేదు



పాఠశాలలో వున్న విద్యార్థులను మరో పాఠశాలకు పంపుతున్నట్లు ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు తెలుపలేదు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు విద్యార్థుల భవిష్యత్‌కి ఇబ్బందిగా మారుతుంది. 3 నుంచి 5వ తరగతుల విద్యార్థులను దూరప్రాంతాలకు పంపాలంటే దారిలో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు.

– నాగేటి మహాలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్, హరిజనవాడ స్కూల్, నన్నూరు

విద్యార్థులకు భారంగా మారుతుంది



3, 4, 5 తరగతుల విద్యార్థులను కిలోమీటరు దూరంలో వున్న పాఠశాలకు పంపితే పుస్తకాలను మోయలేక భారమవుతుంది. వర్షాకాలంలో మరింత ఇబ్బంది పడాల్సివస్తుంది. విద్యార్థుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఇదే పాఠశాలలో యథావిధిగా కొనసాగించాలి. లేదంటే మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుకోవాల్సి వస్తుంది.

– రమణమ్మ, విద్యార్థి తల్లి, నన్నూరు

ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలి



ప్రాథమిక పాఠశాల నిర్వహణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను విరమించుకోవాలి. ఇది పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం వుంది. ఇలాంటి నిర్ణయాలను విద్యార్థుల తల్లితండ్రులకు ముందుగానే చెప్పాలి. ఇలా ఏకపక్ష నిర్ణయాలతో విద్యా వ్యవస్థ నీరుగారుతుంది. భవిష్యత్‌లో పైచదువులకు పోవాలంటే అనేక విద్యాపరమైన సమస్యలు తలెత్తుతాయి. పిల్లల పరిస్థితులను అర్థం చేసుకొని పాఠశాలలను యథావిధంగా కొనసాగించాలి.

– అగుటు లక్ష్మి, విద్యార్థి తల్లి, నన్నూరు

విద్యార్థులను పాఠశాలలో చేర్చుకోవాలి

పాణ్యం: ఆర్‌టీఈ కింద ఎంపికైన విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చేర్పించుకోవడం లేదని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. మంగళవారం పాణ్యంలో తల్లిదండ్రుసు తమ సమస్యలను విద్యాశాఖ అధికారులకు వివరించారు. మండలంలో ఆర్‌టీఈ 12(1)సిలో భాగంగా 1వ తరగతి ప్రైవేటు పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం విద్యార్థులను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ఏడు ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా చేరేందుకు 26 మంది విద్యార్థులు ఎంపిక కాగా కేశవరెడ్డి పాఠశాలకు 8 మంది విద్యార్థులను కేటాయించారు. విద్యార్థులను చేర్పించేందుకు వెళ్లిన తల్లిదండ్రులకు ఇక్కడ 1వ తరగతి నిర్వహించడం లేదని పాఠశాల సిబ్బంది చెప్పడంతో తమ పిల్లల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకొని వెళ్లగా తప్పనిసరిగా కేశవరెడ్డి పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశాలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. కేశవరెడ్డి పాఠశాలకు ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దన్నారు.

తైక్వాండో పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని గచ్చిబౌలిలో ఉన్న జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని వీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సి.వాసిరెడ్డి, డాక్టర్ బి.వినీషా రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక హాస్పిటల్ ప్రాంగణంలో తైక్వాండో పోటీలో పాల్గొనే క్రీడాకారులను అభినందించారు. ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను అవకాశంగా మలుచుకుని రాణించాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోచ్ అజయ్ తేజ పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంట సాగులో మెలకువలను రైతులకు వివరిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: పత్తి పంటకు చీడపీడలు సోకినట్లైతే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తిలో ఏఓ రైతులతో కలిసి పత్తి పంట సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంట సాగు చేసి 15 రోజులు గడిచిన రైతులంతా ఎకరాకు ఒక బస్తా డీఏపీ గాని కాంప్లెక్స్ ఎరువు వేసుకోవాలని సూచించారు. పత్తి పంటను ప్రతి రోజు పరిశీలిస్తూ ఉండాలని, రసం పీల్చే పురుగు, దోమకనిపిస్తే వేపనూనె స్ప్రే చేసుకోవాలని, పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తి పంటలను సంరక్షించుకోండి

సి.బెళగల్: వర్షాభావ పరిస్థితుల నుంచి పత్తి పంటను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ రైతులకు చెప్పారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని సి.బెళగల్, పోలకల్ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏ ఆసిఫ్, వీహెచ్ఏ శశిదేవి, ఎంపీఈఓ వెంకటేష్ పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో బదిలీ టీచర్లను హెచ్ఎం మునిస్వామి, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. స్కూల్లో ఎస్జీటీలుగా పనిచేసిన వరలక్ష్మమ్మ, జాన్సీరాణి అనే ఇద్దరు టీచర్లు పదోన్నతి, బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్నారు. ఈనేపథ్యంలో హెచ్ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు.

వృద్ధులకు రేపటి నుంచి ఇంటింటికీ రేషన్



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు టీవీ రమేష్ బాబు

కర్నూలు(రూరల్): ఈ నెల 26 తేది నుంచి 30 తేది వరకు మండలంలో 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచాన ఉన్న వారికి ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని కర్నూలు రూరల్ తహసీల్దారు టీవీ రమేష్ బాబు రేషన్ డీలర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో జూన్‌నెలలో 85 శాతం రేషన్ పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్డుకు అరకిలో పంచదార, సభ్యుడికి ఐదుకిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రేషన్ దుకాణం వద్ద క్యూఆర్ కోడ్ బోర్డు, ధరల పట్టిక, స్టాక్ బోర్డులు తప్పని సరిగ్గా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రేషన్ సరుకుల పంపిణీలో తూకంపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు శివరామ్, డిప్యూటీ తహసీల్దారు శివ ప్రాసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సురేష్ పాల్గొన్నారు.

29న పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన 'భవ్య భావాలగని – మా భవానీ లీలావతమ్మ' (స్మృతి సంచిక) పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నరసం కార్యదర్శి డండెబోయిన పార్వతీదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ రమణ ఐరోపా యాత్ర విశేషాలు అనే అంశంపై ప్రసంగిస్తారని వెల్లడించారు.

కౌలు కార్డుతో ప్రభుత్వ పథకాలు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు

కల్లూరు: పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు కౌలు కార్డు పొందడం వల్ల ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దపాడు, సల్కాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, మినీ కిట్స్ రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సెరికల్చర్ అధికారి సావిత్రితో కలసి ముందస్తుగా విత్తుకున్న పత్తి పంటను పరిశీలించారు. పంటలో సస్య రక్షణ పద్ధతులను తెలియజేశారు. పత్తి పంటలో పచ్చ, రసం పీల్చు పురుగు నివారణకు వేప నూనె లేదా ఇమిడాక్లోప్రిడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ హుస్సేన్ వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



స్టాప్ డయేరియా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘు

కల్లూరు: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చిన్నటేకూరు ఎంపీపీ పాఠశాలలో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధి నుంచి పిల్లలను కాపాడుదాం అనే నినాదంతో పోస్టర్లను ఆవిష్కరించారు. వంట గదిలో ఆహార పదార్థాలపైనా, కోసిన పండ్లు, కూరగాయల ముక్కలపై దుమ్ము, ధూళి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యవంతులు మాత్రమే వంట చేయాలన్నారు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, సామాజిక ఆరోగ్య అధికారి హిమబిందు, ఆరోగ్య కార్యకర్త జయకుమారి, ఆశా కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, రజని, సులోచన, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్టు కోర్సు (బ్యూటీషియన్)లో ఉచిత శిక్షణ కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) అసిస్టెంట్ డైరెక్టర్ కె.సంతోష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 60 రోజుల పాటు ఇచ్చే శిక్షణలో 70 శాతం హాజరుతో కోర్సును పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం సర్టిఫికెట్‌ను జారీ చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు వై.కాశీ విశ్వనాథం 99492 46094 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

పీజీ ఇంజనీరింగ్ సెట్ ఫలితాలు విడుదల

కర్నూలు (సిటీ): ఆంధ్రప్రదేశ్‌లో ఎంటెక్, ఎం ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 8వ తేదీన నిర్వహించిన ఏపీ పీజీ ఇంజనీరింగ్ సెట్ ఫలితాలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి ఎక్స్‌లో మంగళవారం విడుదల చేశారు. ఇంజినీరింగ్ ఫార్మసీలో 13 సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షల్లో కర్నూలు జిల్లా రీజియన్ నుంచి 821 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 705 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 669 మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం డబ్ల్యూ.కొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన అవుకు ఓబులేసు సివిల్ ఇంజినీరింగ్‌లో 6వ ర్యాంకు సాధించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో నంద్యాల జిల్లా కోవెలకుంట్ల దాసరి కాలనీకి చెందిన ఎం.చంద్రకుమార్ ప్రథమ ర్యాంకు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో నంద్యాల జిల్లా అర్బన్ సంజీవనగర్‌కు చెందిన జె.వెంకటేష్ 6వ ర్యాంకు, కర్నూలు నగరంలోని ధర్మపేటకు చెందిన బోరెల్లి అభిసాత్విక జియో ఇన్ఫర్మాటిక్స్ ఇంజనీరింగ్‌లో 11వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ న్యూ పోస్టల్ వీధికి చెందిన అభిషేకం రబ్బొని నిఖిల్ నాథ్ ఇన్‌స్ట్రుమెంట్ ఇంజనీరింగ్‌లో 7వ ర్యాంకుతో సత్తా చాటారు.

'అల్లూరి సత్యనారాయణ రాజు' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచించిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' నవల ఇంగ్లిష్ వెర్షన్ పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం గంగావతిలోని లయన్స్ క్లబ్ క్యాంపస్‌లోని ఐఎమ్ఏ హాల్‌లో లయన్స్ క్లబ్ గంగావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎమ్. శివకుమార్, కార్యదర్శి ఎ.జంబన్న, కోశాధికారి జి.శివప్ప, అల్లూరి సత్యనారాయణ కుమారుడు డాక్టర్ సోమరాజు తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఆకాశమే హరివిల్లుగా..

అంబరం అరుణవర్ణమైంది. రోజంతా వీ'రవి'విహారం చేసిన ఆదిత్యుడు అరుణ వర్ణపు అందాల్లో దర్శనమిచ్చాడు. ఆకాశం అనే కాన్వాస్‌పై చిత్రకారుడు కుంచెతో రంగులు అద్దాడా అన్నట్లు వివిధ రంగుల్లో ఆకాశం కనువిందు చేసింది. ఈ దృశ్యం గడివేములలో మంగళవారం దర్శనమిచ్చింది.

–గడివేముల

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి తెలిపారు. భగవాన్‌నగర్, శివప్పనగర్, చింతలమునినగర్, గణిగుంతల, ఎంఎస్ లక్ష్మీనగర్, కొడాలి నాగిరెడ్డినగర్, చెన్నమ్మ సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



ప్రమాదాల మలుపు!

ఇక్కడ కనిపిస్తున్న మలుపు కర్నూలు మండల పరిధిలోని దిగువపాడు గ్రామ సమీపంలో ఉంది. ఈ మార్గం గుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మిద్దూరు, నంద్యాలకు వెళ్లి వస్తుంటారు. అయితే, ఏ మాత్రం ఆదమరిచినా ఈ మలుపు వద్ద ప్రమాదానికి గురికావాల్సి వస్తుంది. సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రిపూట పలువురు వాహనదారులు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు స్పందించి మలుపు దగ్గర రోడ్డును విస్తరించడంతో పాటు రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లైట్లు, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. –కర్నూలు (రూరల్)

పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు : పాఠ్యాంశాలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని మీదివేముల జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు పంపిణీ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం గురించి పాఠశాల హెచ్ఎం శ్రీనివాసయాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, డిజిటల్ తరగతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం తదితర అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది 10వ తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడానికి గల కారణాలు, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ సభ్యులు పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాధాకృష్ణ

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బ్రహ్మకుమారుడు రాధాకృష్ణ కోరారు. ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం లొద్దిపల్లె శాఖ ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని రాధాకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మాతేశ్వరి జగదాంబ సరస్వతి పుణ్య స్మృతి దినోత్సవం సందర్భంగా మహిళల సౌలభ్యం కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు శిక్షణ పొంది, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేంద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజమ్మ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.